సాక్షి
అనంతపురం

శనివారం, 19, ఆగస్టు, 2023



చీనీ టన్ను రూ.18,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18,500 పలికాయి. మార్కెట్‌కు 784 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.33

టమాట ధరలు తగ్గాయి. శుక్రవారం కక్కలపల్లి మండీలో కిలో టమాట ధర గరిష్టంగా రూ.33 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
37.2°/22.9°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఆన్‌సెట్ ఇన్‌చార్జ్ సీఈఓగా వరప్రసాదరావు



అనంతపురం కల్చరల్: ఆన్‌సెట్ తాత్కాలిక సీఈఓగా వరప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇది వరకు సీఈఓగా ఉన్న కేశవనాయుడు నెలరోజులు సెలవు పెట్టడంతో భారీ పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్‌గా ఉన్న వరప్రసాదరావుకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులతో సమావేశమై యువజన సంక్షేమ శాఖ ద్వారా సాగే కార్యక్రమాల కొనసాగింపుపై చర్చించారు.

ఇంటింటి సర్వే 83 శాతం పూర్తి

- సర్వే బాగా చేస్తున్నారంటూ కలెక్టర్‌కు సీఈఓ అభినందన



సీఈఓ ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవి

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ–2024లో భాగంగా జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే ఇప్పటి వరకు 83 శాతం పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, ఇంటింటి సర్వే, తదితర అంశాలపై సీఈఓ శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్‌లు, డీఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రి దేవి, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్ పాల్గొన్నారు. జిల్లా ఇంటింటి సర్వేపై సీఈఓకి కలెక్టర్ వివరించారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21వ తేదీకి సర్వే పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఆత్మకూరు మండలం, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల పరిధిలో బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించడం లేదనే ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఈఆర్‌ఓల ద్వారా విచారణ చేయించి వారిచ్చిన నివేదిక ఆధారంగా బీఎల్‌ఓలపై చర్యలు తీసుకున్నామన్నారు. సీఈఓ మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటి సర్వే బాగా చేస్తున్నాంటూ కలెక్టర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, ఏపీఐఐసీ జడ్‌ఎం వరప్రసాద్, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, శ్రీనివాసులు, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

'దిశ' దిక్సూచి కావాలి



మహిళలతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: దంపతుల మధ్య ఎడబాటును కౌన్సెలింగ్ ద్వారా తొలగించి కాపురం నిలబెట్టే దిక్సూచిలా 'దిశ' స్టేషన్ ఉండాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం రాత్రి ఆయన నగరంలోని 'దిశ' పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడకు వచ్చిన మహిళల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే బాధితులతో గౌరవంగా మెలగాలన్నారు. దంపతుల మధ్య ఎడబాటు వస్తే వారు పుట్టింటిలో కుటుంబ సభ్యులతో కలసి సమస్యను పరిష్కరించుకునేంతటి మంచి వాతావరణం స్టేషన్‌లో ఉండాలన్నారు. రాజీ కుదరని పక్షంలో మహిళల అభ్యర్థన మేరకు పోలీసుల చర్యలుండాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆంథోనప్ప, సీఐ చిన్నగోవిందు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గజవాహనంపై వీరభద్రుడు



విడపనకల్లు: ఉండబండలో వీరభద్ర స్వామి గజవాహనంపై ఊరేగాడు. శుక్రవారం వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఆలయ కమిటీ చైర్మన్ బసవరాజు ఆధ్వర్యంలో వీరభద్రస్వామి, కాళికాదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, గజవాహనంపై ఊరేగించారు. అంతకుముందు ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట చేశారు.

సంప్రదాయ పంటలపై..
సన్నగిల్లిన ఆసక్తి



- గణనీయంగా తగ్గిన వేరుశనగ సాగు
- పెరిగిన మొక్కజొన్న, జొన్న, సజ్జ విస్తీర్ణం
- ఖరీఫ్‌లో 2.29 లక్షల హెక్టార్లలో పంటలు



సాగులో ఉన్న సజ్జపంట



మొక్కజొన్న పంట

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఖరీఫ్–2023 పంటల సాగులో భారీగా మార్పులు వచ్చాయి. ఈసారి రైతులకు సంప్రదాయ పంటల సాగుపై ఆసక్తి తగ్గింది. పెట్టుబడులు పెరిగిపోవడం, కూలీల కొరత వేధిస్తుండటం తదితర కారణాల వల్ల తక్కువ పెట్టుబడి అయ్యే పంటల వైపు మొగ్గు చూపారు. ఖరీఫ్‌లో 3.70 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేయగా.. సకాలంలో వర్షాలు రాని కారణంగా ఇప్పటి వరకు 2.29 లక్షల హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. ఇందులో ప్రధాన పంట వేరుశనగ విస్తీర్ణం భారీగా తగ్గింది. 2.31 లక్షల హెక్టార్లలో సాగవుతుందని అంచనా వేసిన వేరుశనగ ఈసారి 1.15 లక్షల హెక్టార్లకు పడిపోయింది.

మొక్కజొన్న డబుల్ ధమాకా..

జిల్లాలో గతంలో ఎప్పుడూ లేనంతగా మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. ఖరీఫ్–2022లో 7,536 హెక్టార్లలో పండించగా, ఈ ఏడాది విస్తీర్ణం 13,959 హెక్టార్లకు పెరిగింది. ఈ పంటకు తక్కువ పెట్టుబడితో పాటు నీళ్ల అవసరం కూడా చాలా తక్కువ. ధర కూడా అనుకూలంగా ఉంది. వరి గత ఏడాది 3,113 హెక్టార్లలో సాగైతే.. ఈసారి అంతకు మించి 4,219 హెక్టార్లలో సాగైంది. ఈ ఏడాది పొద్దుతిరుగుడు విస్తీర్ణం భారీగా తగ్గింది. గతేడాది 1,695 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేయగా.. ఈ ఏడాది 683 హెక్టార్లకు పరిమితమైంది. ఉలవలు, అనుములు, ఆయిల్ సీడ్స్ తదితర పంటల సాగు గణనీయంగా తగ్గించారు.

'నైరుతి'లో తక్కువ వర్షపాతం..

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అతి తక్కువ వర్షపాతం నమోదైంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 61.0 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా.. 45.8 మి.మీ మాత్రమే నమోదైంది. జూలైలో 63.9 మి.మీ సాధారణ వర్షపాతానికి గాను 73.3 శాతం నమోదైంది. ఆగస్టులో 21.4 మి.మీ వర్షపాతానికి గాను 4.4 మి.మీ మాత్రమే నమోదైంది. దీంతో పంటల విస్తీర్ణం గత ఏడాదితో పోల్చితే కాస్త తగ్గింది.

గత ఏడాది.. ప్రస్తుత ఏడాది ఖరీఫ్ ప్రధాన పంటల సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

పంట	2022లో	2023లో
వరి	3,113	4,219
జొన్న	296	652
సజ్జ	640	1,333
మొక్కజొన్న	7,536	13,959
రాగి	11	143
కొర్ర	1,071	1,390
కంది	34,609	35,176
ఆముదం	10,623	16,561
వేరుశనగ	1,96,807	1,15,035



కందిపంట

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి



నేను రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ఎకరాకు రూ.15 వేల చొప్పున రెండు ఎకరాలకు రూ.30 వేల పెట్టుబడి పెట్టాను. ఇంతకు ముందు అదే పొలంలో వరి, వేరుశనగ సాగు చేసేవాడిని. అప్పుడు ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి అయ్యేది. ఇప్పుడు తక్కువ పెట్టుబడితో మొక్కజొన్న సాగు చేశాను. దిగుబడి బాగుంది. – బి.మీనేష్, నాగిరెడ్డిపల్లి, బ్రహ్మసముద్రం మండలం

ప్రత్యామ్నాయ పంటలకే ప్రాధాన్యం



వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. నాకున్న ఏడెకరాల్లో రాగి, మొక్కజొన్న, పత్తి, సజ్జ లాంటి పంటలే ఎక్కువగా పండిస్తున్నా. తద్వారా పెట్టుబడులు తగ్గి ఆశించిన స్థాయిలో లాభాలు ఆర్జిస్తున్నాం. ఈ మధ్య కాలంలో కూరగాయల పంటలపైనా దృష్టి పెట్టాం. – రామకృష్ణారెడ్డి, ఆర్.కొత్తపల్లి, గుమ్మఘట్ట మండలం

అవినీతిపై విచారణకు సిద్ధమా?

- జేసీ ప్రభాకర్‌రెడ్డికి పైలా సవాల్



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: తాడిపత్రి మున్సిపాలిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణకు సిద్ధమా అని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సవాల్ విసిరారు. ఇటీవల జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై ఆయన స్పందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభాకర్‌రెడ్డి పాతికేళ్లుగా మున్సిపాలిటీని తన గుప్పిట్లో ఉంచుకున్నారన్నారు. రెండుసార్లు మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న ఆయన.. అధికారం పక్కకు పోకూడదని తన అనుచరుడైన రమణ (బీసీ)తో పాటు వెంకటలక్ష్మి (బీసీ మహిళ)కు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారన్నారు. వారి హయాంలోనే భారీగా అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. అధికారులను బెదిరించి మరీ కావలసిన పనులు చేయించుకున్నారన్నారు. నిధుల దోపిడీ గురించి ఆయన వ్యాఖ్యానించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. టెండర్లకు సంబంధించి జేసీ అనుచరులైన ఎస్పీ రవీంద్రరెడ్డి అలియాస్ పొట్టి రవి, ఎస్పీ ప్రసాద్ రెడ్డిలు ఎక్సెస్‌కు దాఖలు చేసి.. దోచుకున్నారన్నారు. తాడిపత్రిలో బస్టాండ్ సమీపంలో మెయిన్‌రోడ్డు ప్రాంతంలోని మున్సిపల్ స్థలాలను వారి అనుచరులకు ధారాదత్తం చేశారన్నారు. ఆ ప్రాంతాల్లో వివిధ కాంప్లెక్స్‌లు వెలిశాయన్నారు. మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులనూ కొల్లగొట్టారని ఆరోపించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి చదువుకున్న సంస్కారహీనుడని ఎద్దేవా చేశారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యే అయ్యాక మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆటలు సాగలేదన్నారు. అక్రమార్జనకు బ్రేక్ పడడంతో ఫ్రస్ట్రేషన్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రిపైన, ఎమ్మెల్యేలు, మంత్రులపైన విమర్శలు చేస్తున్నారన్నారు. తాడిపత్రిలోని వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌లకు జేసీ కుటుంబీకుల పేర్లను పెట్టుకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రాజారాం, కార్పొరేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

- ఎంపీ రంగయ్య సూచన



మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య. చిత్రంలో అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, కలెక్టర్ గౌతమి తదితరులు

అనంతపురం అర్బన్: జిల్లాలో చిరుధాన్యాల పంటల సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ తలారి రంగయ్య అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అగ్రీ అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీ ముఖ్య అతిథిగా మాట్లాడారు. చిరుధాన్యాల పంటలపై రైతులకు అవగాహన కల్పించి, సాగు దిశగా ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి సేద్యం చేసేందుకు అవసరమైన విత్తనాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

రాయితీపై విత్తనాలకు చర్యలు తీసుకోండి

అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ టి.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుకు అవసరమైన విత్తనాలను రాయితీతో ఆర్‌బీకేల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయానికి పగలే 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని చెప్పారు. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. చీనీ విక్రయాల్లో రైతు నష్టపోకుండా చూడాలని, సూట్ విక్రయాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'ప్రత్యామ్నాయ' విత్తనాల పంపిణీ

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను పంపిణీ చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. సీజన్‌కు అనుగుణంగా ఆయా శాఖలు వాటి పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలను కొనసాగించాలని చెప్పారు. ఈ క్రాప్ బుకింగ్ సెప్టెంబరు 15లోగా చేయాలన్నారు. మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణం గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ రైతులు పండించే రాగులు, జొన్నలు, కొర్రలు, కందులను పౌరసరఫరాల శాఖ ద్వారా మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కాబట్టి చిరుధాన్యాల సాగు విస్తీర్ణం మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ)ఉమామహేశ్వరమ్మ, పశు సంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, మత్స్య శాఖ డీడీ శాంతి, పట్టుపరిశ్రమ శాఖ అధికారి ఆంజనేయులు, ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, మార్కెటింగ్ ఏడీ చౌదరి, పౌరసరఫరాల సంస్థ డీఎం నీలమయ్య, శాస్త్రవేత్తలు, సహదేవరెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగాలకు నోటిఫికేషన్

అనంతపురం సిటీ: తపాలా శాఖ అనంతపురం డివిజన్‌లోని గ్రామీణ పోస్టాఫీసుల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఎక్కడెక్కడ ఖాళీలున్నాయి, దరఖాస్తు ఎలా చేసుకోవాలి, జీతభత్యాలు ఎలా ఉంటాయి అనే వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. పదో తరగతి అర్హతతో తపాలా కొలువులు దక్కించుకోవచ్చు. దీంతో చాలామంది నిరుద్యోగులు ఎగబడుతున్నారు. ఎటువంటి రాత పరీక్ష లేకుండా, పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు.

ఖాళీ పోస్టులు, జీత భత్యాల ఇలా..

అనంతపురం డివిజన్‌లో మొత్తం 44 ఖాళీల భర్తీకి సంబంధించి తపాలా శాఖ అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. అందులో బీపీఎం 25, ఏబీపీఎం 18, డాక్ సేవక్ పోస్టు 1 ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ పదో తరగతిలో వచ్చిన మార్కులను బట్టి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. బీపీఎంకు వేతనం రూ.12 వేల నుంచి రూ.29,380, ఏబీపీఎం/డాక్ సేవక్ పోస్టుకు రూ.10 వేల నుంచి రూ.24,470 వరకు లభిస్తుంది.

దరఖాస్తు చేసుకునేందుకు గడువు..

ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు ఉంటే ఈ నెల 24 నుంచి 26లోగా చేసుకోవచ్చు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

నేడు పంచాయతీ 'ఉప'పోరు

- ఎన్నికల నియమావళి పాటించాలి
- ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు
- మీడియాతో ఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పంచాయతీ ఉప ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలూ సహకరించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శనివారం జరిగే పంచాయతీ ఉప ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు, ఓటర్లు, ఏజెంట్లు ఎన్నికల నియమావళిని రిటర్నింగ్ అధికారి ఉత్తర్వులను తప్పనిసరి పాటించాలన్నారు. ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు మొబైల్ ఫోన్‌లు, ఐపాడ్, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లరాదన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడ్డం చేయరాదన్నారు. డబ్బు, మద్యం, బహుమతులు ఎర చూపి ఓటర్లను ప్రభావితం చేసే వారిపై గట్టి నిఘా ఉంచామన్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు చేయరాదన్నారు. ప్రధానంగా ఈ విషయంలో గెలిచిన అభ్యర్థులు సహకరించాలన్నారు. బాణసంచ కాల్చడం, బైకులకు సైలెన్సర్లు తొలగించి శబ్దాలు చేయడం లాంటి చర్యలకు అనుమతి లేదన్నారు. ఇలాంటి వాటి వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారి గురించి డయల్ 100 లేదా పోలీసు స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం..

అనంతపురం రూరల్: జిల్లాలో వివిధ కారణాల చేత ఖాళీ ఏర్పడిన సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు శనివారం ఉప ఎన్నికలు జరగనున్నాయి. 33 వార్డులు, రెండు సర్పంచ్ స్థానాలు ఖాళీ ఏర్పడగా 22 వార్డులతో పాటు పెద్దపప్పూరు మండలం దేవునుప్పలపాడు సర్పంచ్ స్థానం ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 11 వార్డులతో పాటు పుట్లూరు మండలం జంగంపల్లి సర్పంచ్ స్థానానికి శనివారం ఉదయం పోలింగ్ జరుగుతోంది. అన్ని ఏర్పాట్లూ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ తెలిపారు.

ఉప ఎన్నికలు జరిగే వార్డు స్థానాలు

మండలం	పంచాయతీ	వార్డు స్థానం
యల్లనూరు	బొప్పేపల్లి	3
పుట్లూరు	చెర్లోపల్లి	1
నార్పల	నార్పల	8
గార్లదిన్నె	బూదేడు	9
కూడేరు	కలగళ్ల	9
గుత్తి	లచ్చుంపల్లి	7
గుత్తి	చెర్లోపల్లి	4
గుత్తి	ధర్మపురం	4
యాడికి	యాడికి	19
యాడికి	రాయలచెరువు	12
పెద్దవడుగూరు	జి.వెంకటాంపల్లి	4

క్లుప్తంగా

నేడు ఉచిత సామూహిక వివాహాలు

ఉరవకొండ: పెన్నహోబిళంలో పైలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య యాదవ్, పైలా రమాదేవి దంపతులు 44 జంటలకు వివాహాలు జరిపించనున్నారు. శనివారం జరిగే ఉచిత సామూహిక వివాహాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 గంటల నుంచి 10: 30 గంటల లోపు శుభముహూర్తంలో లక్ష్మీనృసింహుడి సన్నిధిలో 44 జంటలు సామూహిక వివాహాలతో ఒక్కటి కానున్నాయి. వివాహం చేసుకునే జంటలకు తాళిబొట్టుతో పాటు సామగ్రి అందించనున్నారు. దీంతో పాటు పెళ్లి చేసుకున్న జంటకు ఉచితంగా కుట్టు మిషన్లు అందించనున్నారు. సామూహిక ఉచిత వివాహాలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

ఆయుర్వేద కళాశాల విద్యార్థిని అదృశ్యం


శ్రావణి (ఫైల్)

గుంతకల్లు రూరల్: పట్టణ శివారులోని పద్మావతి ఆయుర్వేద కళాశాలలో నాల్గో సంవత్సరం చదువుతున్న శ్రావణి అనే విద్యార్థిని అదృశ్యమైంది. ప్రకాశం జిల్లా, సింగరాయకొండకు చెందిన ఆదినారాయణ, సంపూర్ణమ్మ దంపతుల కుమార్తె శ్రావణి .. స్థానిక పద్మావతి ఆయుర్వేదిక్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతోంది. గురువారం సాయంత్రం నుంచి ఆమె కనిపించలేదు. కళాశాల యాజమాన్యం విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించింది. శుక్రవారం ఉదయాన్నే కళాశాలకు చేరుకున్న ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని అదృశ్యమైందని, ఇందుకు కళాశాల యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

కణేకల్లు: మండల కేంద్రంలోని దిగువవీధికి చెందిన గొల్ల మహాదేవి (19) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపిన మేరకు.. మహాదేవి కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోయింది. శుక్రవారం వేకువజామున కడుపునొప్పి తాళలేక బాత్‌రూమ్‌లో ఉరివేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సందర్భం: నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


ఉషోదయం వేళ.. మత్స్యకారుల వేట


ఆకలి పోరాటం


సుజలం.. జలాశయం (మిడ్ పెన్నార్ డ్యాం)


అనంత సాగరం.. నుదుటన సూర్య తిలకం

అపురూపం.. చెరగని చిత్రం


అమ్మ చేతల కష్టం.. చిన్నారి చదువుపై ఆరాటం


నాన్న చెమట.. బిడ్డ అక్షర బాట

అనంతపురం కల్చరల్: క్లిక్..క్లిక్.. అంటూ కెమెరా నుంచి వచ్చే శబ్దం.. స్మైల్ ప్లీజ్ అంటూ ఫొటో తీయించుకునే వారిని అలర్ట్ చేస్తూ స్టూడియోలో ఫొటోగ్రాఫర్ చెప్పే మాటలు ఎప్పటికీ ప్రత్యేకమే. గతంలో ఫొటో తీయించుకోవాలంటే స్టూడియోకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం అంతా డిజిటల్ మయమైంది. ఫొటోగ్రఫీ అనేది కొత్త పుంతలు తొక్కింది. అందుకుతగ్గట్టు తీసే విధానమూ మారింది. మెడలో ఉండాల్సిన కెమెరా.. అరచేతిలోకి వచ్చింది.. కెమెరామెన్ అక్కర్లేదు.. నైపుణ్యం ఉండాల్సిన పనిలేదు.. ఎవరికి నచ్చినట్లు, అందరూ మెచ్చేటట్లు చిత్ర వి'చిత్రం'గా అపు'రూప'ంగా తీసుకునే సౌలభ్యం వచ్చింది. ఆనందక్షణాలు, మధుర జ్ఞాపకాలు, అద్భుత సంఘటనలు, విషాద సన్నివేశాలు, తియ్యటి అనుభూతులు.. ఇలా సందర్భం ఏదైనా ఒక్క ఫొటోలో బంధించుకుంటే అప్పటికప్పుడు కాకపోయినా ఎప్పటికైనా అద్భుతమే. జీవితంలోని సంతోషకరమైన క్షణాలు, గత స్మృతులను ఫొటోల్లో పదిలం చేసుకోగలం. వంద మాటల్లో వ్యక్తపరచలేని భావం ఒక్క ఫొటో చెప్తుంది..అందుకే ఫొటోకు కూడా ఒక రోజు కేటాయించి, ప్రత్యేకంగా వేడుక జరుపుకుంటున్నాం.. ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

ఫొటోగ్రఫీకి ఎంతో చరిత్ర ఉంది..

పాశ్చాత్యులు చేసిన అనేక ప్రయోగాల తర్వాత, కుంచెల ద్వారా మాత్రమే చిత్రించగల చిత్రాలను ఫ్రెంచ్‌మ్యాన్ లూయిస్ డాగూరె, జోసెఫ్ నైస్‌ఫోర్ నీప్సేతో అభివృద్ధి చేయబడ్డాయి. నమ్మలేని అద్భుతాలను ఆవిష్కరించే ప్రయత్నంలో ఫొటోగ్రఫీది ఎప్పటికీ అగ్రస్థానమే. బ్లాక్‌అండ్‌వైట్ చిత్రాల నుంచి కదిలే రంగుల చిత్రాల వరకు ఫొటో చేస్తున్న విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. అది వేసే ప్రతి అడుగూ ముందడుగే. ఫొటోగ్రఫీలో ప్రయోగాలు చేస్తూ సహజ సౌందర్యాలను తమ కెమెరాల్లో బంధిస్తున్న అనంత వాసులు ఎందరో మరో అడుగు ముందుకేసి చిన్నపాటి సినిమాలు, లఘుచిత్రాలకు పనిచేసి పేరు తెచ్చుకున్నారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకోనున్నారు.

- ఫొటోలు - బాషా / వీరేష్

యాడికి కాలువ పూర్తికి సహకరించండి


సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, యాడికి నాయకులు

యాడికి: యాడికి కాలువ పూర్తయ్యేలా సహకరించాలని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిశారు. ఈసందర్భంగా తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తాడిపత్రి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల నిధుల కేటాయింపు విషయంలో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే 95 శాతం యాడికి కాలువ పూర్తయిందని, మిగిలిన పనులు పూర్తి చేయించాలని సీఎంను కోరామన్నారు. నియోజక వర్గంలోనే పెద్ద మండలమైన యాడికిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని విన్నవించామన్నారు. స్పందించిన సీఎం వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకుడు బాలా రమేష్‌బాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి(పెద్దవడుగూరు) ఉన్నారు.

జగన్ పాలనపై అపార విశ్వాసం

- ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వ

విడపనకల్లు: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి ఇంటికీ నాలుగేళ్లలో రూ.2 లక్షల నుంచి రూ.4లక్షల వరకు లబ్ధి చేకూరిందని, ప్రజలు కూడా జగనన్న పాలనపై విశ్వాసం చూపుతున్నారని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాళాపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విలేకరులతో మాట్లాడారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చుచేస్తోందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన వెంటనే ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షలు మంజూరు చేసి, గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తోందన్నారు. జగన్ పరిపాలనకు రాష్ట్రంలో అన్నీ వర్గాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు.

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్..

దేశ వ్యాప్తంగా కూడా అనేక సర్వే సంస్థలు సర్వేలు వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో క్లీన్ స్వీప్ చేస్తోందని మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయం అని సర్వే చెప్తున్నాయని ఎంపీ, ఎమ్మెల్యే అన్నారు. 25 ఎంపీలు స్థానాలు, 175 అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని అత్యంత కీలకమైన జాతీయ సర్వే సంస్థలు చెప్తున్నాయన్నారు. చంద్రబాబుకు కూడా సర్వేలను చూసి మతిభ్రమించిందన్నారు. ఎలాగైనా జగన్ ప్రభుత్వంపై ప్రజలకు తప్పుడు ప్రచారాల ద్వారా గెలవాలనుకుంటున్నారు. ప్రతిపక్షాలు ఎంత మాత్రం కూడా పాజిటివ్ అజెండానే లేదన్నారు. ప్రజలను ఎలాగైన మోసం చేసి అధికారంలోకి రావాలని నెగిటివ్ ఆలోచనతో ముందుకు వస్తున్నారన్నారు. ప్రజలు వద్ద చంద్రబాబు ఆటలు సాగవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ముందు ప్రతిపక్షాలు చిత్తు చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమానికి కూడా ప్రజల నుంచి విశేష స్పందన చూసి ప్రతి పక్షాలకు తమ భవిష్యత్తు తెలిసిపోయి జగన్‌పై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నాయన్నారు. ప్రజలు పూర్తిగా జగన్‌పైనే అభిమానం చూపుతున్నారని, మరోకసారి 2024లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యం అని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, వైస్ ఎంపీపీ సునీతారాణి, సర్పంచు రామాంజనేయులు, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, భీంరెడ్డి, మేకల రామాంజినేయులు, ప్రకాష్‌గౌడు, నాగన్నగౌడు, తదితరులు పాల్గొన్నారు.

'రెడ్‌క్రాస్' సేవలు విస్తృతం చేయండి

- జిల్లా కలెక్టర్ గౌతమి


మొబైల్ బ్లడ్ కలెక్షన్ బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సేవలను విస్తృతం చేయాని సభ్యులకు కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. రక్త సేకరణ క్యాంపుల సంఖ్య పెంచాలని సూచించారు. కెనడియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖకు అందజేసిన రూ. కోటి విలువ చేసే మొబైల్ బ్లడ్ కలెక్షన్ బస్సును కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఎం.గౌతమి శుక్రవారం ప్రారంభించారు. బస్సులో రక్త సేకరణకు ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తరించేందుకు మొబైల్ బ్లడ్ కలెక్షన్ బస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్త సేకరణకు అవసరమైన అన్ని సౌకర్యాలు బస్సులో ఉన్నాయన్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో ఉన్న రక్త దాతల నుంచి రక్తం సేకరించేందుకు అవకాశం ఉందన్నారు. రక్తమార్పిడి సదుపాయం ఉందన్నారు. 100 శాంపిళ్లు నిల్వ చేసే సామర్థ్యం ఉన్న రిఫ్రిజిరేటర్ కూడా ఉందన్నారు. ప్రమాదాలు జరిగినా, అత్యవసర పరిస్థితుల్లోనూ రక్తం అవసరం ఉన్న సత్వర సేవలు అందించొచ్చన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కూడా మొబైల్ బస్సు సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణ్‌ప్రసాద్, కోశాధికారి మల్లికార్జున, కార్యదర్శి మల్లికార్జున, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ యుగంధర్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి


- జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు


అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలోని పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన నిర్వహించారు. స్పందనలో 12 వినతులు అందాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పని చేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్పీని కలిసి వారి సమస్యలు విన్నవించారు. సిబ్బందితో ముఖాముఖి మాట్లాడిన ఎస్పీ.. సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సిబ్బంది సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ లేదన్నారు. విధి నిర్వహణ నిత్యం బిజీగా ఉండే సిబ్బందికి అవసరమైన సదుపాయాలు, సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయభాస్కరరెడ్డి, జి.రామకృష్ణ, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకరరెడ్డి, ఎస్పీ సీసీ ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి కిడ్నాప్ యత్నం


కొత్తూరు గ్రామస్తులను విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం కొత్తూరులో రెండో తరగతి చదువుతున్న చిన్నారి మౌనికను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్తూరుకు చెందిన జుట్టు పాతన్న, శ్రీలక్ష్మీ దంపతుల కుమార్తె మౌనిక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. శుక్రవారం పాఠశాల అయిపోగానే గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ముసుగులు ధరించి బైకుపై వచ్చి మౌనికను కేకు కట్ చేస్తున్నామని, నీకూ ఇస్తామంటూ ఎత్తుకెళ్లారు. కొద్ది దూరం వెళ్లాక చిన్నారి తనను ఎవరో ఎత్తుకెళ్తున్నారని గమనించి ఏడ్వడం మొదలుపెట్టింది. సమీపంలోని గొర్రెల కాపరులు అనుమానాస్పదంగా వస్తున్న వారిని నిలబెట్టేందుకు ప్రయత్నించారు. దీంతో దుండగులు వెంటనే చిన్నారిని తిరిగి ఊరి వైపు తీసుకెళ్లి వదిలిపెట్టారు. గాబరాగా వచ్చిన కుమార్తెను తల్లిదండ్రులు ఎత్తుకుని ప్రశ్నించగా.. తనను ఎవ్వరో బైకులో తీసుకెళ్లి మళ్లీ ఇక్కడే వదిలిపెట్టారని విలపించింది. కుటుంబ సభ్యులు వెంటనే కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన గ్రామంలోకి చేరుకుని అనుమానాస్పదంగా వచ్చిన ద్విచక్ర వాహనదారులను తనిఖీ చేసి వివరాలు ఆరా తీశారు. చిన్నారిని నిజంగా కిడ్నాప్ చేయాలనుకున్నారా? లేక ఏవైనా తగాదాలతో బెదిరించడానికి ఇలా చేశారా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

హెచ్చెల్సీ నీటి చౌర్యానికి చెక్


హెచ్చెల్సీలో నీటి చౌర్యం చేసేందుకు వేసిన పైపులను తొలగిస్తున్న స్పెషల్ టీమ్ ఆఫీసర్లు


కణేకల్లు: తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువలో నీటి చౌర్యం కట్టడికి హెచ్చెల్సీ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. కాలువలో మోటార్లు, పైపులు వదిలి అక్రమంగా జలచౌర్యం చేస్తూ నాన్ ఆయకట్టులో పంటలు సాగు చేస్తున్నారు. దీంతో జలచౌర్యాన్ని అరికట్టాడానికి హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అనంతపురం హెచ్చెల్సీ డివిజన్‌లో పని చేస్తున్న డీఈఈలు రమేష్, సూర్యనారాయణ నేతృత్వంలో జేఈ శ్రీనివాసులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాష్‌రెడ్డి బృందంగా ఏర్పడి శుక్రవారం తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ చివరి కిలోమీటర్ 189 నుంచి ఆంధ్రా సరిహద్దు 105 కిలోమీటర్ వరకు పర్యటించారు. కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ జేఈ గోపాల్‌నాయక్ కూడా పాల్గొన్నారు. తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ పొడువునా అమర్చిన పైపులను తొలగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మనోహర్ (ఫైల్)

ఉరవకొండ: స్థానిక శివ రామిరెడ్డి కాలనీకి చెందిన దినసరి కూలీ మనోహర్ (28) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు..మనోహర్ పెన్నహోబిళంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి శుక్రవారం ద్విచక్రవాహనంపై తిరిగి ఉరవకొండకు బయల్దేరాడు. ఉరవకొండ సమీపంలోని కేకే పెట్రోల్ బంకు సమీపంలో బళ్లారి నుంచి అనంతపురం వెళ్తున్న ఐచర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనింది. ఈప్రమాదంలో మనోహర్ అక్కడి అక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు మనోహర్‌కు భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బేల్దారి మృతి


వెంకటేష్ (ఫైల్)

పామిడి: మండల కేంద్రం సమీపంలోని బీసీసీ రోడ్డు పెన్నా వంతెనపై ద్విచక్రవాహనం బోల్తా పడి బేల్దారి తలారి వెంకటేష్ (53) మృతి చెందాడు. వివరాలు.. స్థానిక సంతమార్కెట్‌వీధికి చెందిన తలారి వెంకటేష్ ద్విచక్ర వాహనంపై కల్లూరుకు బయల్దేరాడు. వంతెనపై ద్విచక్రవాహనం బోల్తా పడి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమైంది.దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భార్య తలారి ఓబుళమ్మ, కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని రోదించారు. మృతుడికి భార్య తలారి ఓబుళమ్మ, పెళ్లైన కుమార్తెలు చంద్రకళ, అనూష ఉన్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య సేవలు ప్రజలకు అందాలి

అనంతపురం క్రైం: ప్రభుత్వ కార్యక్రమాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు తెలియజేయాలని, ఆరోగ్యసేవలన్నీ ప్రజలకు అందాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏఎన్‌ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ అందించే ఆరోగ్యశ్రీ పథకం అమలు, ఆన్‌లైన్ వ్యాక్సినేషన్, హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ విధానం, ప్రధానమంత్రి మాతృత్వ వందనయోజన పథకం, ఈ- ఆశా, వివిధ ఆరోగ్య సేలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గర్భిణులకు మొదటి మూడు నెలల్లోపు రిజిస్ట్రేషన్ చేసి, నాలుగు సార్లు వైద్యులతో చికిత్సలు అందించాలన్నారు. ఐరన్, బీ కాంప్లెక్స్, కాల్షియం మాత్రలు పంపిణీ చేయాలన్నారు. దోమకాటు నివారించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. కుష్టు, క్షయ బాధితులను గుర్తించి, వారికి సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మహేంద్రనాథ్, డాక్టర్ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్గత రోడ్ల విస్తరణ వేగవంతం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరంలో అంతర్గత రోడ్ల విస్తరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని మేయర్ వసీం అన్నారు. శుక్రవారం 39వ డివిజన్‌లో సీసీ రోడ్డు, కాలువ పనులను ఆయన పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో నగరంలో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. మురికివాడల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలెవరూ నమ్మబోరన్నారు. మేయర్ వెంట వైఎస్సార్ సీపీ నాయకులు చింతకుంట మధు, ఖాజా, భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి, గుర్రప్ప, బంగారప్ప, తదితరులు ఉన్నారు.

మెలకువలతో అధిక దిగుబడులు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

అనంతపురం రూరల్: మెలకువలు పాటిస్తే అధిక పంట దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి (ఏఓ) శశికళ రైతులకు సూచించారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురంలో 'పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం సాగవుతున్న వేరుశనగ, కంది ఇతర పంటలలో ఆకుపచ్చ దోమ నివారణకు అధిక మోతాదులో రసాయనాలు పిచికారి చేయడం వల్ల పంటలను కాపాడే మిత్ర పురుగులు నశించిపోతాయన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకే రసాయనాలను వాడాలన్నారు. అధిక మోతాదులో మందులు వాడటం వల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు పంటల దిగుబడులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనతా మెడికల్స్ ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి జనతా మెడికల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం క్రైం: నగరంలోని క్లాక్‌టవర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ జనతా మెడికల్స్‌ను శుక్రవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. మందులపై 20 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు నిర్వాహకులు నాగిరెడ్డి తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి సేకరణ పూర్తి



ఆత్మకూరు పంచాయతీ నుంచి తీసుకొచ్చిన మట్టిని కుండలో పోస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: నా భూమి– నాదేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని 17 పంచాయతీల నుంచి సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు మట్టిని సేకరించి శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుబ్బర హేమలత, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ ఆధ్వర్యంలో సెక్రటరీలు తీసుకువచ్చిన మట్టిని ఓ కుండలో పోశారు. ఈ మట్టిని నియోజకవర్గ కార్యాలయానికి పంపించారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి అక్కడి నుంచి అమరావతికి, అక్కడి నుంచి ఢిల్లీకి మట్టిని పంపిస్తున్నట్లు చెప్పారు.

జగనన్న కాలనీల్లో సదుపాయాలు కల్పిస్తాం

బుక్కరాయసముద్రం: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హౌసింగ్ ఈఈ కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జగనన్నకాలనీలో ఈఈ, జెడ్పీటీసీ భాస్కర్ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. ముందుగా గ్రామంలో ఎన్ని లే అవుట్లు ఉన్నాయి, ఎంత మందికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరయ్యాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలో త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.

అడ్డదిడ్డ ప్రయాణం.. ప్రాణ గండం



జాతీయ రహదారిపై అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు



ప్రమాదమని తెలిసినా.. డివైడర్లను దాటుకుని వెళ్తున్న వాహనదారులు

జాతీయ రహదారిపై వాహనాలు అతివేగంగా వెళ్తుంటాయి. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పక్కాగా పాటించాల్సి ఉంటుంది. అలా కాదని అడ్డదిడ్డంగా వెళితే ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది. ఎన్నోసార్లు ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. అయినా కొందరు త్వరగా గమ్యస్థానం చేరుకోవాలని వెనకా ముందు చూసుకోకుండా రోడ్డును అడ్డంగా దాటేస్తున్నారు. డివైడర్లు ఎక్కించి మరీ అటువైపు వెళ్తున్నారు. ఏ వాహనం ఎటువైపు నుంచి వస్తుందో అర్థం కాక ఎదుటి వాహనదారులు తికమకపడుతున్నారు. శుక్రవారం హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారి ఇస్కాన్ సమీపంలో వాహనదారులు అడ్డదిడ్డంగా వెళ్తూ ఇలా 'సాక్షి' కంటపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



డివైడర్‌ను దాటుతున్న వాహనదారుడు

హైవే రెస్టారెంట్లపై కేసు నమోదు

- శుభ్రత విషయంలో అలసత్వం
- కాలం చెల్లిన తినుబండారాలు
- మరిగిన నూనే మళ్లీ మళ్లీ వినియోగం
- ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడితే చర్యలు
- రెస్టారెంట్ నిర్వాహకులకు ఫుడ్ సేఫ్టీ అధికారుల హెచ్చరిక



రెస్టారెంట్‌లో లోపాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు

అనంతపురం క్రైం: హైవే వెంబడి ఉన్న పలు రెస్టారెంట్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కేసు నమోదు చేశారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ్ చక్రవర్తి నేతృత్వంలో ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీం, ఎంహెచ్ఓ గంగాధర్‌రెడ్డి, వైద్యులు మనోజ్ బృందం శుక్రవారం రుద్రంపేట వద్ద బెంగళూరు హైవేకు ఆనుకుని ఉన్న పలు రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. శుచి, శుభ్రత పాటించని 'గార్లిక' రెస్టారెంట్‌కు ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేశారు. 'ద వింటేజ్ రెస్టారెంట్'లో కాలం చెల్లిన ఎంసీ కైన్ క్రిస్పీ పొటాటో ప్యాక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేఎఫ్‌సీ రెస్టారెంట్‌లో నల్లగా మారిన వంట నూనెను గుర్తించారు. వంట నూనెను పదేపదే వాడరాదని సూచించారు. ఎక్సోటికా రెస్టారెంట్‌ను పరిశీలించి శుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజారోగ్యంతో ఆటలాడితే ఉపేక్షించేది లేదని రెస్టారెంట్ నిర్వాహకులకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ్‌చక్రవర్తి హెచ్చరించారు.

రేపటి నుంచి శ్రావణ మాస ఉత్సవాలు



సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో 20వ తేదీ నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం అవుతున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 20న మొదటి ఆదివారం నాగుల చవితి అష్టోత్తర శత కళశాభిషేకం, 21న సర్పసూక్త క్షీరాభిషేకం, 22న షష్టి మహోత్సవం, కల్యాణోత్సవం, 27న సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం, సెప్టెంబర్ 3న అన్నాభిషేకం, 10న శత సర్పసూక్త హరిద్రాభిషేకము, ఆశ్లేషాబలి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎనిమిది గంటలు.. 13.50 ఎకరాల్లో సేద్యం!



కందిలో చిన్న గుంటకతో సేద్యం చేస్తున్న రైతు

విడపనకల్లు: ఎనిమిది గంటల్లో 13.50 ఎకరాల్లో గుంటక సేద్యం చేసి ఓ రైతు రికార్డు సృష్టించాడు. పెద్ద కొట్టాలపల్లి రైతు కాకర్ల రవికి చెందిన 13.50 ఎకరాల కంది పంటలో మాళాపురం గ్రామానికి చెందిన రాజేష్ శుక్రవారం ఉదయం 7.10 గంటలకు చిన్న గుంటకతో కలుపుతీత సేద్యం ప్రారంభించి మధ్యాహ్నం 3 గంటలకు పూర్తి చేశాడు. రాజేష్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఏపీ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్

అనంతపురం కల్చరల్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఏపీ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. దేవదాయ శాఖ పాలనా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. అనంత, సత్యసాయి జిల్లాలకు చెందిన వివిధ ఆలయాల ధర్మకర్తల మండలి చైర్మన్లు, సభ్యులు, పలు ఆలయాల ఈవోలు పాల్గొన్నారు. కార్యక్రమానికి జ్వాలాపురం శ్రీకాంత్‌తో పాటు ఎండోమెంట్ పాలనా సంస్థ డైరెక్టర్ రామచంద్రరావు తదితరులు విశిష్ట అతిథులుగా హాజరై ఆలయాల ధర్మకర్తల విధులు, బాధ్యతలు అనే అంశంపై మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నేతృత్వంలో రాష్ట్రం ముందెన్నడూ లేని విధంగా ఆలయ ధర్మపరిరక్షణకు పాటుపడుతోందన్నారు. అదేవిధంగా పలువురు ఈవోలు, వివిధ ఆలయాల చైర్మన్లు ఆలూరు రామచంద్రారెడ్డి, అశ్వర్థం, పప్పూరు, గూగూడు, పామిడి చైర్మన్లు అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తక్షణమే దేవదాయ శాఖ సర్వశ్రేయో నిధి నుంచి నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మొదటిరోడ్డు శివాలయం ఈవో రమేష్ బాబుతో పాటు సురేష్, వెంకటస్వామి, తిమ్మారెడ్డి, వేణు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జ్వాలాపురం శ్రీకాంత్

'ఆరోగ్యశ్రీ' సేవలు పెంచుదాం

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద ఎక్కువమంది రోగులకు సేవలందించేలా చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులకు సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఏపీజీడీపీ హాలులో హెచ్ఓడీలతో ఆయన సమావేశమయ్యారు. ఆరోగ్యశ్రీ కేసులు పెంచేందుకు హెచ్ఓడీల విజ్ఞప్తులను తీసుకుని, కేసుల పురోగతికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూపరింటెండెంట్ సలహాలందజేశారు. ఆరోగ్యశ్రీ కేసులు పెంచడం ద్వారా ఆస్పత్రికి ఆదాయం సమకూరుతుందని, తద్వారా వివిధ విభాగాలనభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ప్రాణాపాయ కేసులకు తక్షణ వైద్య సేవలందించాలన్నారు. ముఖ్యంగా 'ఈ– హాస్పిటల్' విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమష్టిగా పని చేసి సర్వజనాస్పత్రిని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని హెచ్ఓడీలను ఆదేశించారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, హెచ్ఓడీలు డాక్టర్ రామస్వామినాయక్, డాక్టర్ రామస్వామి, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శంషాద్‌బేగం, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ భాస్కర్, ఏడీలు డాక్టర్ శ్రీనివాస్‌శౌరి, డాక్టర్ సౌజన్య కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ సుభాష్‌చంద్ర బోస్, న్యూరోసర్జన్ డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

నేత్రపర్వం.. శ్రీవారి కల్యాణం





కల్యాణోత్సవ దృశ్యాన్ని తిలకిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) పుష్పాలంకరణలో శ్రీవారు

అనంతపురం కల్చరల్: రామ్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 16వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారికి మహాకుంభాభిషేకం, విశేష అలంకారంతో పాటు తోమాల సేవ, మహాసేవ, మహా పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతీ వేంకటేశ్వరుల కల్యాణ మహోత్సవం తిరుమల వీధులను తలపిస్తూ నయన మనోహరంగా సాగింది. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ప్రధాన అర్చకుడు ప్రదీప్‌శర్మ శాస్త్రోక్తంగా మాంగల్యధారణ చేయించారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని తరించారు. మధ్యాహ్నం తీర్థప్రసాద వినియోగం, అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం గరుడ వాహనంతో సర్వాంగసుందరంగా అలంకరించిన పూలరథంపై శ్రీవారు దర్శనమిచ్చారు.

ప్రతి హామీ నెరవేరుస్తున్నాం



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పారిశుధ్య కార్మికులకు బియ్యం కార్డులు అందజేశారు. అలాగే రాజీవ్‌కాలనీ పంచాయతీ ప్రధానరహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మట్లాడారు. టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే, ఎంపీ, మేయర్ స్వార్థ ప్రయోజనాల కోసం గ్రూపులుగా విడిపోయి నగర అభివృద్ధిని విస్మరించారని ధ్వజమెత్తారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్కటీ నెరవేర్చలేకపోయారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి–సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతి హామీని నెరవేర్చి ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేశారు. నగరంలో రూ.750 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. డంప్‌యార్డును తొలగించడం అసాధ్యమని, బయోమైనింగ్ పద్ధతిలో చెత్త నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్ సాకే చంద్రలేఖ, ఎస్సీ సెల్ నగరాధ్యక్షుడు సాకే కుళ్లాయిస్వామి, సచివాలయ కన్వీనర్లు శోభన్, సురేష్, రాజీవ్ కాలనీ ఉప సర్పంచ్ మసూద్, మాజీ సర్పంచ్ హుస్సేన్, నాయకులు అంజి.రంగయ్య, బాబు, వీఆర్ఓ అమర్నాథ్ పాల్గొన్నారు.

సిలిండర్లు సకాలంలో పంపిణీ చేయండి

రాప్తాడు: లబ్ధిదారులకు సకాలంలో గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయాలని కెనరాబ్యాంకు మేనేజర్ వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రాప్తాడులోని స్థానిక ఆదిత్యా భారత్ గ్యాస్ ఏజెన్సీ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల దగ్గర నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదిత్యా భారత్ గ్యాస్ ఏజెన్సీ డీలర్ పిక్కిలి ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సర్వీసును రెగ్యులర్ చేయాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో 1993 సంవత్సరానికి ముందు నుంచే పనిచేస్తున్న ఎన్ఎంఆర్, ఎంటీఎస్, కంటింజెంట్ ఉద్యోగుల సర్వీస్‌ను రెగ్యులర్ చేయలంటూ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పశు సంవర్ధక శాఖ కార్యాలయం వద్ద జేఏసీ నాయకులు ఆందోళన చేశారు. ఏఐఎస్‌టీయూ న్యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న, జేఏసీ నాయకులు నాగేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి మాట్లాడారు. 2014 ముందు విధుల్లోకి చేరిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. అదే విధంగా 1993 కంటే ముందు నుంచే మినిమమ్ టైమ్‌స్కేల్, ఎన్ఎంఆర్, ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగుల సర్వీసును కూడా ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఫక్రుద్దీన్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అన్ని విధాలా పంచాయతీ అభివృద్ధి

అనంతపురం రూరల్: ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతోనే రాజీవ్‌కాలనీ పంచాయతీ అన్ని విధాలా అభివృద్ధి చెందిందని సర్పంచ్ ఆశాబీ స్పష్టం చేశారు. పంచాయతీ పరిధిలోని డంపింగ్ యార్డ్‌ను ఆమె శుక్రవారం పరిశీలించారు. అధికారంలో ఉన్నపుడు పంచాయతీ అభివృద్ధిని విస్మరించిన టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే అనంతను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, పసలూరి ఓబిలేసు, అంజి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో తక్షణమే దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేయాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విద్య, వైద్య రంగాల్లో ప్రవేశపెట్టిన పథకాలు చరిత్రాత్మకమైనవని అన్నారు. అనంతపురంలో రోడ్డు విస్తరణలో భాగంగా సప్తగిరి సర్కిల్‌లో తొలగించిన వైఎస్సార్ విగ్రహాన్ని కూడా తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు జ్ఞానేశ్వర్, సీతారామిరెడ్డి, కోటేశ్వరరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని వివిధ రంగుల పూలతో అలకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



సనప మాధవరాజులస్వామి

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో సనప మాధవరాజుల విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. విగ్రహ ప్రతిష్టలో భాగంగా శనివారం గోపూజ, మహా గణపతి పూజ, హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 20న యంత్రాభిషేకము, పంచామృత, సుగంధ ద్రవ్య, క్షీరాదివాహనం, విగ్రహ ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయి. అలాగే 21న ఉదయం 10 గంటలకు మాధవరాజుల స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



హనుమంతు నాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తోపుదుర్తి చందు

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్ల ఎగువ తండాకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు హనుమంతు నాయక్ శుక్రవారం ఉదయం గుండె పోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి చందు శుక్రవారం వేపచెర్ల ఎగువ తండాకు చేరుకొని హనుమంతు నాయక్ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని కుటుంబ సభ్యులను భరోసా కల్పించారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
శనివారం ॥ 19-8-2023

"ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ...
ఏమేమి కాయొప్పనే గౌరమ్మ!
తంగేడు పువ్వులో... తంగేడు కాయలో...
ఆట చిలుకలు రెండు... పాట చిలుకలు రెండు..."

* * *

"చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దులగుమ్మ
బంగారు బొమ్మ దొరికేనమ్మా ఈ వాడలోన..."


న్యూజెర్సీలో బతుకమ్మ వేడుక (ఫైల్ ఫొటో)

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో! అమెరికా బతుకమ్మ ఉయ్యాలో!!

''ఇలా ఒకటా... రెండా... లెక్కలేనన్ని బతుకమ్మ పాటలు మా నాలుకల మీద నాట్యమాడుతుంటాయి. గ్రామాల్లో గడిచిన బాల్యం జీవితాన్ని నేర్పుతుంది. తెలంగాణ గ్రామాల్లో బాల్యం బతుకమ్మ పాటల రూపంలో సమాజంలో జీవించడాన్ని నేర్పుతుంది. నిరక్షరాస్యులు కూడా ఈ పాటలను లయబద్ధంగా పాడతారు. బతుకమ్మ పాటల సాహిత్యం వాళ్ల నాలుకల మీద ఒదిగిపోయింది. తమకు తెలిసిన చిన్న చిన్న పదాలతో జీవితాన్ని అల్లేశారు గ్రామీణ మహిళలు. మా నాన్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీర్. మా అమ్మమ్మ గారి ఊరు జగిత్యాల జిల్లా, వెలుగుమాట్ల. నా చదువు పుట్టపర్తిలో, సెలవులు అమ్మమ్మ ఊరిలో. దసరా సెలవులు వస్తున్నాయంటే సంతోషం అంతా ఇంతా కాదు. దేశమంతా దేవీ నవరాత్రులు జరుపుకుంటూ ఉంటే మేము బతుకమ్మ వేడుకలు చేసుకుంటాం. గౌరమ్మ అందరి మనసుల్లో కొలువుంటుంది, మాట, పాట, ఆట అన్నీ గౌరమ్మ కోసమే అన్నట్లు ఉంటుందీ వేడుక. ఇంత గొప్ప వేడుకకు దూరమయ్యానని అమెరికా వెళ్లిన తర్వాత కానీ తెలియలేదు. అందుకే అమెరికాలో బతుకమ్మను పేర్చాను'' అన్నారు దీప్తి మామిడి... కాదు, కాదు, బతుకమ్మ దీప్తి.


దీప్తి మామిడి

''నేను 2007లో యూఎస్‌కి వెళ్లాను. న్యూజెర్సీలో ఉండేవాళ్లం. పెళ్లయి, ఒక బిడ్డకు తల్లిని. భర్త, పాప, ప్రొఫెషన్‌తో రోజులు బిజీగా గడిచి పోయేవి. డబ్బు కూడా బాగా కనిపించేది. కొద్ది నెలల్లోనే... ఏదో మిస్సవుతున్నామనే బెంగ మొదలైంది. వ్యాక్యూమ్ ఏమిటనేది స్పష్టంగా తెలియలేదు, కానీ బాల్యం, సెలవుల్లో బతుకమ్మ వేడుక మరీ మరీ గుర్తుకు వస్తుండేది. బతుకమ్మ కోసం ఇండియాకి రావడం కుదరక పోతే నేనున్న చోటే బతుకమ్మ వేడుక చేసుకోవచ్చు కదా! అనిపించింది. అలా అక్కడున్న తెలుగువాళ్లను ఆహ్వానించి బతుకమ్మ వేడుక చేశాను. మొదటి ఏడాది పదిహేను మందికి లోపే... పదేళ్లు దాటేసరికి ఆ నంబరు ఐదారు వందలకు చేరింది. అందరికీ భోజనాలు మా ఇంట్లోనే. ఏటా ఒక పెళ్లి చేసినట్లు ఉండేది. ఇండియా నుంచి తెలంగాణ పిండివంటలను తెప్పించుకోవడం, ఆ రోజు వండుకోవాల్సినవన్నీ మా ఇంట్లోనే వండడం, ఆ వంటల కోసం దినుసులను సేకరించడం, స్నేహితులందరినీ ఆహ్వానించడం, పూలు తెచ్చుకుని ఒక్కొక్కటీ పేర్చడం... ఇలా ప్రతి ఘట్టాన్నీ ఎంజాయ్ చేసేదాన్ని. 'ఏటా అంతంత ఖర్చు ఎందుకు' అని స్నేహితులు అనేవాళ్లే కానీ మా వారు ఒక్కసారి కూడా అడగలేదు. నా సంతోషం కోసం చేసుకుంటున్న ఖర్చు అని అర్థం చేసుకునేవారు.

ఎప్పుడూ అన్నం ఉంటుంది!

యూఎస్‌లో మా ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద ఎప్పుడూ అన్నం, కూరలుండేవి. మా కన్సల్టెన్సీకి వచ్చిన వాళ్లు, ముఖ్యంగా బ్యాచిలర్స్ కోసం ఈ ఏర్పాటు. మేము యూఎస్‌లో అడుగుపెట్టిన కొన్నాళ్లకే రెసిషన్ వచ్చింది. అప్పుడు పడిన ఇబ్బందులు నాకిప్పటికీ గుర్తే. అందుకే యూఎస్‌కి వచ్చిన కుర్రాళ్లు మన తెలుగింటి రుచులతో భోజనం చేస్తారు కదా! అనుకునేదాన్ని. షడ్రసోపేతమైన భోజనం అని కాదు కానీ కనీసం పప్పుచారయినా ఉండేది. ఈ అలవాటుకు బీజం పడింది కూడా అమ్మమ్మ దగ్గరే. అమ్మమ్మ పెద్ద పాత్రలో అంబలి చేయించి ఇంటి ముందు పెట్టేది. చాలామంది పొలం పనులకు వెళ్తూ దారిలో మా ఇంటి ముందాగి అంబలి తాగి, ఆవకాయ ముక్క చప్పరించుకుంటూ వెళ్లేవాళ్లు. ఆకలి తీర్చడంలో, అవసరమైన వాళ్లకు సహాయం చేయడంలో ఉండే సంతృప్తి మరి దేనిలోనూ ఉండదు. మా డ్రైవర్ ఇతర పనివాళ్ల పిల్లల చదువు కోసం ఫీజులు కట్టినప్పుడు మరొకరి జీవితానికి మనవంతు సహాయం చేస్తున్నామనే భావన సంతృప్తినిస్తుంది. అవకాశం లేనప్పుడు ఎలాగూ చేయలేం, వెసులుబాటు ఉన్నప్పుడయినా చేసి తీరాలి. మన ఎదుగుదల కోసం సమాజం నుంచి మనం తీసుకుంటాం, మనం ఎదిగిన తరవాత మరొకరి ఎదుగుదల కోసం ఆపన్న హస్తాన్ని అందించి తీరాలనేది పుట్టపర్తి స్కూల్ నేర్పించిన వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్. మా అమ్మ ఫ్రెండ్ లీలా ఆంటీ కూడా బతుకమ్మ పండుగను బాగా చేసేవారు. ఆమె ఎన్విరాన్‌మెంట్ యాక్టివిస్ట్. గునుగుపూలు వాటర్‌బాడీస్‌ని శుద్ధి చేస్తాయని చెప్తూ ఈ పండుగ వెనుక ఉన్న పర్యావరణ పరిరక్షణను వివరించేవారు. ఇవన్నీ మైండ్‌లో ఒక్కటొక్కటిగా అల్లుకుంటూ ఇలా దండ కూర్చుకున్నాయి.

బతుకమ్మ దీప్తినయ్యాను!

యూఎస్ జీవితం నాకు చాలా నేర్పించిందనే చెప్పాలి. అక్కడ అన్నీ ఉంటాయి కానీ ఏదో లేదనే వెలితి. రొటీన్ లైఫ్‌ని జాయ్‌ఫుల్‌గా మలుచుకోవడానికి నాకు బతుకమ్మ ఒక దారి చూపించింది. అప్పట్లో యూఎస్ ఇంతగా ఇండియనైజ్ కాలేదు. ఇప్పుడైతే న్యూజెర్సీ, డాలస్‌తోపాటు కొన్ని నగరాలు పూర్తిగా భారతీయలవే అన్నట్లు, తెలుగువాళ్ల ఊళ్లే అన్నట్లయిపోయాయి. మన పండుగలు ఇప్పుడు అందరూ చేసుకుంటున్నారు. నేను మొదలుపెట్టడంతో నేను బతుకమ్మ దీప్తినయ్యాను. 'దీప్తి మామిడి'గా అమెరికాలో అడుగుపెట్టాను. మూడేళ్ల కిందట తిరిగి వచ్చేటప్పటికి నా పేరు 'బతుకమ్మ దీప్తి'గా మారింది. బతుకమ్మ పాటకు మ్యూజిక్ మొదలైతే చాలు... ఒళ్లు పులకించిపోతుంది. పూనకం వచ్చినట్లే ఉంటుంది. మీతో మాట్లాడుతున్నా సరే... బతుకమ్మ ఫీల్ వచ్చేస్తుంది. చూడండి గూజ్‌బంప్స్ వచ్చేశాయి'' అని చేతులను చూపించారు బతుకమ్మ దీప్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

న్యూస్‌మేకర్ - లక్ష్మి

గిరిజన సరస్వతి

జె.ఇ.ఇ. ఎంట్రన్స్‌లో ర్యాంకు కొట్టడం సామాన్యం కాదు. అందుకై కొందరు రాజస్తాన్ వెళ్తారు. కొందరు హైదరాబాద్, విజయవాడ చేరుకుంటారు. తల్లిదండ్రులు గైడ్ చేస్తారు. కాని నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు పుట్టిన కోయ విద్యార్థిని కొర్సా లక్ష్మి గురుకుల పాఠశాలలో చదువుకునే మంచి ర్యాంకు సాధించింది. పాట్నా ఐఐటీలో సీటు సాధించింది. కోయలలో ఒక అమ్మాయి సాధించిన స్ఫూర్తినిచ్చే విజయం ఇది. కొర్సా లక్ష్మి పరిచయం.

కొంతమంది ఇళ్లల్లో, నిజానికి చాలామంది ఇళ్లల్లో పిల్లలు జె.ఇ.ఇ. ఎంట్రన్స్ రాయడానికి తల్లిదండ్రులు చాలా శ్రద్ధ పెడతారు. బాగా చదివించే కోచింగ్ సెంటర్ కోసం అవసరమైతే రాజస్థాన్‌లోని కోటాకు వెళతారు లేదా హైదరాబాద్, విజయవాడలలో ప్రఖ్యాత కోచింగ్ సెంటర్‌లలో వేస్తారు. ఇక పిల్లలు ఇంట్లో ఉండి చదువుకుంటుంటే టీవీలు బంద్ చేస్తారు. మాటా పలుకూ లేకుండా పిల్లలు ఇరవై నాలుగ్గంటలూ చదువుకునేలా చేస్తారు. మెటీరియల్ తెచ్చిస్తారు. చాలా హైరానా పడతారు. అదేం తప్పు కాదు. కాని ఇలాంటివన్నీ లేకుండా కూడా కొంతమంది విజయం సాధిస్తుంటారు. కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చదువుకున్న కోయ విద్యార్థిని కుర్సా లక్ష్మి అలాంటి విజేతే. పట్టుదలతో చదువుకుని ర్యాంకు సాధించిన విజేత.


తండ్రి కన్నయ్య, తల్లి శాంతమ్మలతో లక్ష్మి

ఐసులమ్మే తండ్రి కూతురు

కొత్తగూడెం నుంచి దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన తండా కాటాయగూడెం. 300 గడపలున్న గ్రామం ఇది. అందరూ కోయలే. వ్యవసాయ కూలీలే. ఏ కొద్ది మందికో కాసింత భూమి ఉంటుంది. కొర్సా లక్ష్మి తండ్రి కన్నయ్యకు ఎకరం భూమి ఉంది. కాని వాన పడితేనే పండుతుంది. కన్నయ్య వ్యవసాయ కూలీగా వెళతాడు. తల్లి శాంతమ్మ కూడా. వ్యవసాయ పనులు లేనప్పుడు తన టీవీఎస్ ఎక్సెల్ మీద ఐస్ బాక్స్ పెట్టుకుని ఐసులమ్ముతాడు. ముగ్గురు పిల్లలు. కాని పెద్ద కొడుకు చదువు ఇష్టం లేక 7వ తరగతిలో ఇంట్లో నుంచి పారిపోయాడు. రెండో కొడుకు మామూలు చదువే. చివరి అమ్మాయి లక్ష్మి బాగా చదువుకోవాలని నిశ్చయించుకుంది.

పిన్ని స్ఫూర్తి

కన్న తల్లిదండ్రులు చదువు లేని వారు కావడాన లక్ష్మికి చదువులో ఏ సాయమూ చేయలేకపోయేవారు. ఆరవ తరగతి నుంచి కొత్తగూడెం గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న లక్ష్మికి పిన్ని సుమలత స్ఫూర్తిగా నిలిచింది. డిగ్రీ చదువుకున్న సుమలత హాస్టల్‌లో ఉన్న లక్ష్మిని తరచూ కలుస్తూ చదువు విలువ చెబుతూ వచ్చింది. డబ్బుకు విలువ ఇవ్వని వారు కూడా చదువుకు విలువ ఇస్తారని తెలిపింది. సెలవుల్లో ఇంటికి తీసుకువచ్చి లక్ష్మి మంచి చెడ్డలు చూసేది. ఆమె మాటలు లక్ష్మి మనసులో నాటుకుపోయాయి. 'ఏ రోజూ కూడా రాత్రి ఒంటి గంట లోపు లక్ష్మి పుస్తకం మూయగా చూడలేదు' అని లక్ష్మి బాబాయ్ రవి తెలిపాడు.

గురుకుల పాఠశాలలో

కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో దాదాపు వేయి మంది అమ్మాయిలు 6 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్నారు. ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు వీరి చదువు మీద బాగా శ్రద్ధ పెడుతున్నారు. చురుకైన విద్యార్థినులను ఎంపిక చేసి జె.ఇ.ఇలో శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్‌లో ఎం.పి.సి తీసుకున్న లక్ష్మి 992 మార్కులు సాధించింది. దాంతో ఇంకా ఉత్సాహంతో జె.ఇ.ఇకి ప్రిపేర్ అయ్యింది. జె.ఇ.ఇ అడ్వాన్స్‌డ్‌లో 1371వ ర్యాంకు సాధించింది. పాట్నా ఐ.ఐ.టిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో మొన్నటి ఆగస్టు మొదటివారంలో సీటు పొందింది. గురుకుల పాఠశాల నుంచి ఈ ఘనత సాధించిన అమ్మాయి లక్ష్మే.

ఐ.ఏ.ఎస్ చేయాలని...

బాగా చదువుకుని ఐ.ఏ.ఎస్ చేయాలనేది తన లక్ష్యమని కొర్సా లక్ష్మి చెప్పింది. జె.ఇ.ఇలో మంచి ర్యాంకు సాధించి ఐ.ఐ.టిలో సీటు పొందడంతో ఐ.టి.డి.ఏ అధికారులు లక్ష్మిని ప్రశంసించారు. ట్యాబ్ ఇచ్చి ఆర్థిక సహాయం చేశారు. లక్ష్మి ఇంత బాగా చదవడంతో ఇంకా కొంతమంది ఆమె చదువును ప్రోత్సహించడానికి ముందుకొచ్చారు. ఆ ప్రోత్సాహం వల్ల లక్ష్మి ఐ.ఏ.ఎస్ చదివి పేద వర్గాల కోసం పని చేయాలని నిశ్చయించుకుంది.



నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే

వారియర్ కెమెరా

● కర్తవ్యాన్ని గుర్తు చేసే కెమెరా కన్ను

ఆరతి కెమెరాతో మాట్లాడి చూడండి... చేపల సవ్వడి లేని నదుల దీనత్వాన్ని గురించి చెబుతుంది. చేవ లేని జీవజాలాన్ని గురించి చెబుతుంది. పచ్చదనాన్ని కోల్పోయి నేలకూలనున్న నిర్జీవ వృక్షాల మృత్యుఘోష చెబుతుంది. నదుల నీటిలోని విషాన్ని గురించి వివరంగా చెబుతుంది. స్థూలంగా చెప్పాలంటే...కనిపించే అందాల వెనుక కనిపించని నిశ్శబ్ద విధ్వంసాన్ని గురించి కళ్లకు కడుతూ చెబుతుంది. బెంగళూరుకు చెందిన ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్ ఆరతి కుమార్ రావు తన కెమెరాతో పర్యావరణ సంరక్షణం గురించి క్షణం క్షణం గుర్తు చేస్తోంది...


ఆరతి కుమార్ రావు

ప్రతి కెమెరాకు ఒక దృష్టి ఉంటుంది. మరి ఆరతి కెమెరా చూసేది ఏమిటి?

అట్టడుగున పడి కన్పించని కథలు, నిజజీవిత కథలు, పట్టించుకోవాల్సిన అవసరం ఉన్నా ఎవరూ పట్టించుకోని కథలు, సంప్రదాయ జీవనశైలులు, వాటిలో వస్తున్న అనూహ్య మార్పులు, పదాలకు దొరకని దృశ్యాలు...ఇలా ఎన్నో ఎన్నెన్నో.

చిన్నప్పటి నుంచి 'నేషనల్ జియోగ్రఫీ' పత్రికలను చూస్తూ పెరిగింది ఆరతి. ఆ ఎల్లో బార్డర్ విండోస్ నుంచి విశాలమైన ప్రపంచాన్ని చూసింది. ఆ పత్రికలోని ఫొటోగ్రాఫ్స్ తనపై ఎంతో ప్రభావం చూపాయి. పదాలతోనే కాదు చిత్రాలతో కూడా గొప్ప సత్యాలు చెప్పవచ్చుననే విషయం అర్థమైంది.

చిన్నప్పటి నుంచి ఫిజిక్స్ అంటే ఇష్టం ఉన్న ఆరతి బయోఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసింది.

ఆ తరువాత 'లైఫ్‌టైమ్ టు-డూ' రూపంలో భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంది. దానిలో నదులతో పరిచయం ఒకటి. నదులను, వాటి చుట్టూ ఉండే జీవితాన్ని ఫొటోల రూపంలో డాక్యుమెంట్ చేయాలనుకుంది.

కాళ్లకు బలపాలు, కళ్లకు కెమెరాలు కట్టుకొని ఊరూరు తిరిగినా తల్లిదండ్రులు ఎప్పుడూ అభ్యంతర పెట్టలేదు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వివిధ ప్రాంతాలలో తన ఫొటోగ్రఫీకి సంబంధించిన విషయాలను కుటుంబసభ్యులతో పంచుకునేది ఆరతి.

ఫొటోల ద్వారా ఎన్విరాన్‌మెంటల్ స్టోరీ టెల్లింగ్‌లో నేర్పు సంపాదించిన ఆరతి తన ప్రయాణంలో ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. పర్యావరణం గురించి మాట్లాడే వారిని అభివృద్ధి వ్యతిరేకులుగా భావించే వారిని కూడా చూసింది.

'రివర్ డైరీస్' అనేది ఆమె ప్రస్థానంలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌గా పేరు తెచ్చుకుంది. నదుల అందాలతో పాటు వాటికి ఎదురవుతున్న ఆపదలకు 'రివర్ డైరీస్' అద్దం పడతాయి.






చిత్రాలు: ప్రకృతి, ప్రకృతితో ముడిపడిన మనిషి జీవితం

'హింస, వివాదాలు మాత్రమే హెడ్‌లైన్స్‌గా కనిపిస్తాయి. అయితే పర్యావరణ విధ్వంసం అనే భయానకమైన కనిపించని హింస చాపకింద నీరులా కొనసాగుతుంది' అంటుంది ఆరతి. ఆ కనిపించని హింసమూలాలను నలుగురికి తెలియజేసేలా చేయడంలో తన కెమెరాను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటోంది.

ఆరతి ఫొటోగ్రాఫర్ మాత్రమే కాదు రచయిత్రి కూడా. ఆమె పుస్తకాలలో 'మార్జిన్‌ల్యాండ్స్: ఇండియన్ ల్యాండ్‌స్కేప్స్ ఆన్ ది బ్రింక్' ఒకటి. ఇందులో లడఖ్ నుంచి సుందరబన్ వరకు ప్రకృతికి సంబంధించిన ఎన్నో సుందరచిత్రాలను కళ్లకు కడుతుంది. గంగ–బ్రహ్మపుత్ర–మేఘన పరీవాహక ప్రాంతాలకు తీసుకువెళుతుంది. భౌగోళిక అందాలతో పాటు ఎదురవుతున్న ప్రమాదాలను, అక్కడి ప్రజలు మాట్లాడుకునే పదాలను పరిచయం చేస్తుంది.

'నిర్మాణాలు, ఇతరత్రా విధ్వంసక కార్యకలాపాల వల్ల ప్రమాదం అంచున ఉన్న ప్రకృతిని కాపాడు కోవడం అనేది మన చేతిలోనే ఉంది' అని ఈ పుస్తకం ద్వారా చెబుతుంది ఆరతి.

'పర్యావరణంలో వచ్చే మార్పులు, అవి మన జీవితాల్లో తెచ్చే మార్పులను నా కెమెరా ద్వారా ఇక ముందు కూడా కథలుగా చెప్పాలనుకుంటున్నాను' అంటోంది ఆరతి.


ఒకానొక సందర్భంలో తన నిరసన గళాన్ని ఇలా వినిపించింది ఆరతి,,,,

'కరువుకాటకాలు, వరదలలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మాత్రమే పర్యావరణ విధ్వంసం, పరిరక్షణ గురించి మాట్లాడుకుంటారు. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు మునిగిపోతారు'

అయితే ఆరతిలాంటి ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్‌లు తమ చిత్రాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి మన కర్తవ్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూనే ఉన్నారు.

కవితకేదీ కాదు అనర్హం అన్న చందాన మెటల్, ప్లాస్టిక్, పాత గాడ్జెట్స్ ఏదైనా ఆయన చేతిలో పెట్టారంటే అందమైన శిల్పంగా మారాల్సిందే. అరవైఏళ్ల వయసులో చిన్నప్పటి హాబీని కెరీర్‌గా మలుచుకున్నాడు విశ్వనాథ్ మల్లాబ్ది దావంగిరె. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్‌గా మార్చి అబ్బురపరుస్తున్నాడు ఈ పెద్దాయన.

ఈ-వేస్ట్ శిల్పి


విశ్వనాథ్

బెంగళూరుకు చెందిన విశ్వనాథ్ తండ్రి డీఎమ్ శంభు ప్రముఖ శిల్పి ఇంకా పెయింటర్ కూడా. విశ్వనాథ్ మెడిసిన్ చదివి మంచి డాక్టర్ కావాలని శంభు కలలు కనేవారు. చిన్నప్పటి నుంచి సెకండ్ హ్యాండ్ వస్తువులను సరికొత్తగా మార్చడమంటే విశ్వనాథ్‌కు ఆసక్తి ఎక్కువ. ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేయాలని నిర్ణయించుకున్నాడు.

చదువు పూర్తైన తరువాత తరువాత మీడియాలోకంప్యూటర్ వీడియో గ్రాఫిక్ ఆర్టిస్ట్‌గా చేరాడు. అలా కెరీర్ ప్రారంభించిన విశ్వనాథ్ ఒక్కోమెట్టు ఎదుగుతూ విప్రోలో చేరాడు. ఇక్కడ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూనే ఖాళీ సమయం, వారాంతాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకోఆర్ట్‌గా ఎలా మార్చాలని పరిశోధిస్తుండేవాడు. రకరకాల ప్రయోగాల తరువాత.. గాడ్జెట్స్ వ్యర్థాలను ఉపయోగించి చిన్నచిన్న జంతువులు తయారు చేశాడు. అవి ముద్దుగా ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో తన ఇకో ఆర్ట్‌ను పెంచుకుంటూ పోయాడు. ఫ్యాషన్ జ్యూవెలరీ నుంచి అందమైన శిల్పాలు, రోబోలదాకా అన్ని ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నాడు.



ఏరికోరి ఎంచుకుని...

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రాణాంతకంగా మారాయని తెలుసుకుని ఇకో ఆర్ట్‌ను మరింత సీరియస్‌గా తీసుకున్నాడు విశ్వనాథ్. ఈ క్రమంలోనే ఈ వ్యర్థాలను కొనుక్కునేవాడు. అన్నింటిని గంపగుత్తగా కొనకుండా కంప్యూటర్ విడిభాగాలు, ల్యాప్‌టాప్స్, డేటా కార్డులు, డీవీడీ, వీసీఆర్, ఫ్లాపీ డ్రైవ్స్, సెట్-టాప్‌బాక్స్‌లు, ల్యాండ్‌లైన్, కార్డ్‌లెస్ ఫోన్‌లు, గ్లూకో మీటర్లను ఏరికోరి ఎంచుకుని తీసుకునేవాడు. వీటిలో కూడా రాగి, బంగారం, రంగు రంగుల వైర్లు, కీబోర్డులను ప్రత్యేకంగా సేకరించి రకరకాల బొమ్మల రూపకల్పనకు ఉపయోగిస్తున్నాడు. ఆరు అడుగుల అమ్మాయి రూపంతో విగ్రహం, ప్రముఖ వ్యాపారవేత్త అజీం ప్రేమ్‌జీ ఫోటో, ఇకో జ్యూవెలరీ, కీబోర్డు కామధేనువు వంటి బొమ్మలు ఐదు వందలకు పైగానే తయారు చేశాడు.

హాబీని కెరీర్‌గా...


విశ్వనాథ్ తయారు చేసిన బొమ్మలు ఆకర్షణీయంగా అందంగా ఆకట్టుకుంటుండడంతో విక్రయించడం మొదలు పెట్టాడు. రెండేళ్ల క్రితం రిటైర్ అయిన విశ్వనాథ్.. తొలినాళ్లల్లో హాబీగా ఉన్న ఇకోఆర్ట్‌ను పూర్తి సమయం కేటాయిస్తూ ఇకోఆర్ట్ వస్తువులు విక్రయిస్తూ సరికొత్త కెరీర్‌ను సృష్టించుకున్నాడు. ఇకోఆర్ట్ వస్తువులు కొనే కస్టమర్లు ఢిల్లీలోనేగాక, యూరప్, నెదర్లాండ్స్, అమెరికా వంటి దేశాల్లో ఇకో ఆర్ట్ కోసం కస్టమర్లు ఎగబడుతున్నారు. దేశంలోనేగాక విదేశాల్లో తన ఇకో ఆర్ట్‌ను ప్రదర్శిస్తూ మంచి ఆదరణ పొందుతున్నాడు.











వందల కేజీలపైనే...

కీబోర్డు కీల నుంచి గోడగడియారంలో భాగాల వరకు అన్నీ సేకరించి ఇకో ఆర్ట్ రూపొందిస్తోన్న విశ్వనాథ్ ఇప్పటిదాకా రెండువందల కేజీల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్స్‌గా మార్చాడు. అయితే ఈ ఇకో ఆర్ట్ అంత సులభం కాదని విశ్వనాథ్ చెబుతున్నాడు. ''ఈ – వ్యర్థాల నుంచి ఆర్ట్ కావాల్సిన భాగాలను సేకరించి వాటికి ఆకారం, రంగు వేసి తుదిమెరుగులు దిద్దడానికి చాలా సమయం పడుతుంది. జ్యూవెలరీ తయారు చేయడానికి రెండు మూడు నిమిషాలు పడితే, శిల్పాలు తయారు చేయడానికి వారాలు, నెలలు పడుతుంది. అయినప్పటికీ ప్రస్తుతం రీసైక్లింగ్ చేసిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. ఇటు కస్టమర్ల మనసు దోచుకోవడంతోపాటూ, పర్యావరణానికి హానీ కలగకుండా ఈ ఇకోఆర్ట్ ఎంతో సంతృప్తినిస్తుంది. ముందు ముందు మరిన్ని కళారూపాలు తీసుకురానున్నాను''అని విశ్వనాథ్ చెబుతున్నాడు.